నమస్తే తెలంగాణ
# జగిత్యాల
12 | కరీంనగర్, ఆదివారం 12 జనవరి 2025 | JAGTIAL

## కేసీఆర్‌ను కలిసిన చల్మెడ



వేములవాడ, జనవరి 11 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును శనివారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా శాలువాతో సత్కరించిన అనంతరం రాజరాజేశ్వర స్వామి ప్రసాదాన్ని అందించారు. ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత పార్టీ నాయకులు, శ్రేణులు, చేస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్‌లో తీసుకునే నిర్ణయాలు.. ఇలా పలు అంశాలపై ఇద్దరి మధ్య చర్చ సాగినట్టు తెలుస్తున్నది. ఈ సందర్భంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులను అభినందించడంతో పాటు నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కృషి, ఇతర కార్యక్రమాలపై కేసీఆర్ సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, భవిష్యత్ అంతా బీఆర్‌ఎస్ హవానే ఉంటుందని, నిర్భయంగా ముందుకుసాగాలని సూచించడంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ శ్రేణుల యోగక్షేమాలపై ఆరా తీసినట్టు తెలిసింది.

## టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

తిమ్మాపూర్, జనవరి 11 : హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న వాహనాలతో మండలంలోని రేణికుంట టోల్‌ప్లాజా కిక్కిరిసిపోయింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగుతూనే ఉన్నది. ఒక్కోసారి వాహనదారులకు 20 నిమిషాలు సమయం పట్టింది. దీంతో పలువురు వాహనదారులు సిబ్బందితో ఘర్షణ పడ్డారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.



టోల్ వద్ద బారులు తీరిన వాహనాలు

♦ పండక్కి ఇంటికి పోయేదెట్లా..?

# బస్సు ఎప్పుడొస్తదో..!

- రద్దీకి అనుగుణంగా బస్సులు కరువు
- బస్టాండ్లలో గంటల తరబడి నిరీక్షణ
- కిక్కిరిస్తున్న కరీంనగర్ బస్‌స్టేషన్
- సీట్లు దొరకక అవస్థలు.. నిల్చొండే ప్రయాణం
- హైదరాబాద్- కరీంనగర్ మధ్య పెరిగిన రద్దీ
- వచ్చిన ప్రతి బస్సూ ఓవర్ లోడే!
- స్పెషల్ సర్వీసుల్లోనూ నిల్చొనే..
- ఆగ్రహిస్తున్న ప్రయాణికులు

## సంక్రాంతి వేళ ప్రయాణికుల తిప్పలు

సంక్రాంతి పండుగ వేళ ఆర్టీసీ చుక్కలు చూపుతున్నది. సొంతూళ్లకు వెళ్లాలనుకునే ప్రయాణికులకు నరకం చూపెడుతున్నది. రద్దీకి సరిపడా బస్సులు నడపక ఇబ్బందులకు గురి చేస్తున్నది. బస్సుల సంఖ్య పెంచుతామని ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటి వరకు ఒక్క బస్సును కూడా పెంచకపోవడంతో వ్యయప్రయాసలకోర్చి ఇళ్లకు చేరుకోవాల్సి వస్తున్నది. కుటుంబ సమేతంగా ప్రయాణిస్తున్న వారైతే లగేజీ, పిల్లలను వెంటేసుకొని గంటల తరబడి బస్సుల కోసం బస్టేషన్లలో నిరీక్షించాల్సిన దుస్థితి ఉన్నది. రాత్రి వేళ పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. జంక్షన్‌లా మారిన కరీంనగర్ బస్టేషన్ నాలుగైదు రోజుల నుంచి ఎప్పుడు చూసినా వేలాది మందితో కిక్కిరిసిపోయి కనిపిస్తుండగా, 'బస్సు ఎప్పుడొస్తుందా..?' అని ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్ జేబీఎస్ నుంచి కరీంనగర్, గోదావరిఖని, మంచిర్యాల, ఆసిఫాబాద్ తదితర పట్టణాలకు రావడానికి అష్టకష్టాలు పడుతున్నారు. సీటు కోసం చూస్తే ఇంటికి వెళ్లే పరిస్థితి లేక నిలబడే ప్రయాణిస్తున్నారు. స్పెషల్ బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలు చెల్లించినా సీటు దొరక్క నిల్చుండే వెళ్తున్నారు. పండగ సందడి మొదలైనప్పటి నుంచి ఏ ఊరి బస్సును చూసినా కిక్కిరిసి వెళ్తున్నది. ప్రయాణికులను కుక్కి కుక్కి పంపిస్తుండగా, ఓవర్‌లోడ్‌తో బస్సులు మొరాయించే దుస్థితి ఏర్పడుతున్నది.



కరీంనగర్ బస్టేషన్‌లో ప్రయాణికులు

### గంటకు మీదనే అయింది



నేను నిజామాబాద్ పోదామని ఫ్యామిలీతో కలిసి కరీంనగర్ బస్టాండ్ వచ్చిన. గంటకు మీదనే అయింది. ఒక్క బస్సు లేదు. ఇక్కడ చూస్తే నరకం కనిపిస్తంది. మస్తు మంది ఇబ్బంది పడుతున్నరు. చిన్న పిల్లలు చలికి వణికి పోతున్నరు. ఎక్స్‌ప్రెస్‌ల కూడా కుక్కికుక్కి ఎక్కిస్తున్నరు. ఇది పోతే ఇంకో బస్సు రాదని ఆర్టీసీ వాళ్లే చెప్తున్నరు. దూర ప్రాంతాలకు వెళ్లే వాళ్లయినా నిలబడి పోతున్నరు.

- జబ్బార్, ప్రయాణికుడు (నిజామాబాద్)

### బస్సు ఎక్కలేక పోతున్న



బస్టాండ్లకచ్చి గంటన్నర అయితంది. మా మల్లాపూర్‌కు పొయెతానికి ఒక్క బస్సత్త లేదు. వచ్చిన బస్సుకు ఎగవడి ఎక్కుతున్నరు. ఒకల మీదొకలువడి ఎక్కుతున్నరు. నేను కింద పడ్తనని ఎక్కలేక పోతున్న. ఇట్లనే ఉంటే ఈ రాత్రికి కరీనారం బస్టాండ్లనే ఉండుడైతదో.. ఏందో. బస్సులు ఎక్కువ నడిపితే ఈళ్లకు ఏమైతది?

- పొత్తూరు మల్లమ్మ, ప్రయాణికురాలు (మల్లాపూర్)

### ఏ రాత్రయితదో..



సిద్దిపేట బస్టాండ్ల నిలబడీ నిలబడి యాస్టకచ్చింది. అక్కడి నుంచి ఒక ప్రైవేట్ వెహికిల్లో కరీంనగర్ వచ్చిన. ₹140 తీసుకున్నరు. ఇక్కడి నుంచి నేను పెద్దపల్లికి, అక్కడి నుంచి కమాన్‌పూర్‌కు వెళ్లాలే. ఇక్కడ కూడా సిద్దిపేట లెక్కనే ఉంది. ఒక్క బస్సు వస్త లేదు. చీకటైతంది. చలి పెడుతంది. ఇంటికి ఎట్ల పోవుడో అర్థమైత లేదు. పోయేసరికి ఏ రాత్రయితదో. పండుగ పూటనైనా కొన్ని ఎక్కువ బస్సులు వేస్తే బాగుండు. కరీంనగర్ అన్ని ప్రాంతాలకు జంక్షన్ లెక్కున్నది. కనీసం ఇక్కడి నుంచైనా బస్సులు పెంచితే బాగుండు.

- రాజుకుమార్, ప్రయాణికుడు (కమాన్‌పూర్)

కరీంనగర్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 ఆర్టీసీ డిపోల్లో 817 బస్సులు నడుస్తున్నాయి. అయితే పండుగ సమయాల్లో రద్దీ ఉన్న రూట్లలో ఎక్కువ బస్సులు నడిపిస్తుంటారు. ప్రధానంగా హైదరాబాద్, కరీంనగర్, గోదావరిఖని రూట్లలో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీ, రాజధాని సర్వీసులు వేస్తుంటారు. ఇప్పుడు ఈ రూట్లలో పల్లె వెలుగు బస్సులు కూడా నడిపిస్తున్నారు. ఇక పల్లె వెలుగు బస్సులు నడిచే రూట్లలో బస్సుల సంఖ్య తగ్గింది. దీంతో హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కరీంనగర్ చేరుకున్న ప్రయాణికులు స్వగ్రామాలకు చేరడానికి ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ప్రస్తుత రద్దీకి సరిపడా బస్సుల్లేక ప్రయాణికులు గంటల తరబడి కరీంనగర్ బస్టేషన్‌లో నిరీక్షించాల్సి వస్తున్నది. వచ్చిన కొద్ది బస్సుల్లోనే సర్దుకొని వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ, సుల్తానాబాద్, పెద్దపల్లి, ఓదెల, మంథని తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో అడుగుపెట్టే సందు ఉండడం లేదు. ఈ రెండు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుందని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేస్తుంటే.. సరిపడా బస్సులు లేకుంటే తాము గమ్య స్థానాలకు ఎలా వెళ్తామని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అడ్డగోలు చార్జీలు వెచ్చించి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తున్నది.

### కరీంనగర్‌లో నిరీక్షణే..

హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలంటే కరీంనగర్ బస్టేషన్ జంక్షన్‌గా ఉన్నది. పండుగ సందడి మొదలైనప్పటి నుంచి ఈ బస్టేషన్‌లో ఎప్పుడూ విపరీతమైన రద్దీతో కనిపిస్తున్నది. గోదావరిఖని, పెద్దపల్లి, మంథని, మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు హైదరాబాద్‌కు వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. ఈ ప్రాంతాల నుంచి నేరుగా హైదరాబాద్ వెళ్లే బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో వయా కరీంనగర్ వరకు వస్తున్నారు. తీరా ఇక్కడ చూస్తే హైదరాబాద్ వెళ్లేందుకు సరిపడా బస్సుల్లేక గోస పడుతున్నారు. నాలుగైదు రోజుల నుంచి కరీంనగర్ బస్టేషన్‌లో అడుగు పెట్టలేని పరిస్థితి ఉన్నది. ఇక జేబీఎస్ నుంచి అదనంగా బస్సులు నడుపుతున్నామని అధికారులు చెబుతున్నా గంటల తరబడి నిరీక్షిస్తే తప్పా దొరకడం లేదు. అది కూడా చాలా వరకు నిల్చుండే ప్రయాణించాల్సి వస్తున్నది. కరీంనగర్ రీజియన్ మేనేజర్ రాజు హైదరాబాద్ జేబీఎస్‌లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు రోజుల్లోనే 500 ట్రిప్పుల్లో సుమారు 70 వేలకుపైగా ప్రయాణికులను జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు తరలించినట్టు అధికారులు చెబుతున్నారు. వీకెండ్ కావడం, ఆదివారం కలుపుకొని పండగ సెలవులు రావడంతో శనివారం ఒక్క రోజు 50 వేలకుపైగా ప్రయాణికులు కరీంనగర్, హైదరాబాద్ మధ్యన రాకపోకలు సాగించినట్టు తెలుస్తున్నది.

### హైదరాబాద్ నుంచి 6 గంటలు పట్టింది



హైదరాబాద్‌లో ఉంటున్న కరీంనగర్‌కు చెందిన రాజేశ్ దంపతులు పండగ కోసం తమ ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటికి వచ్చేందుకు శనివారం ఉదయం జేబీఎస్ బస్టేషన్‌కు వచ్చారు. అక్కడి నుంచి కరీంనగర్ రావడానికి ఒక్క బస్సు అందుబాటులో లేక గంటలపాటు బస్టేషన్‌లోనే నిరీక్షించారు. వచ్చిన బస్సులు క్షణాల్లో కిక్కిరిసి పోతున్నాయి. పిల్లలు ఉన్నారని సీట్ల కోసం వెతికితే వచ్చిన బస్సులు వచ్చినట్టే వెళ్లిపోయాయి. ఎట్టకేలకు మధ్యాహ్నం 12 గంటలకు ఒక బస్సు ఎక్కారు. వీళ్లు ఎక్కిన బస్సు కూడా అన్నింటిలాగే కిక్కిరిసి పోయింది. అయితే ఈ బస్సు కరీంనగర్ చేరుకునే సరికి ఆరు గంటల సమయం పట్టింది. సీట్ల కోసం చూస్తే అక్కడి నుంచి కరీంనగర్ రాలేమని తెలుసుకుని చాలా మంది నిలబడే వస్తున్నారని, అయినా అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని అజయ్ వాపోయాడు. అజయ్‌లాగేనే ఎంతో మంది పండుగ వేళ పిల్ల పాపలతో అతికష్టం మీదా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

### చార్జీలు పెంచినట్టే బస్సులు పెంచాలి



నేను హైదరాబాద్ నుంచి పిల్లల్ని తీసుకుని కోరుట్లకు పోతున్న. కరీంనగర్ వరకే టికెట్ మీద ₹150 పెంచిన్రు. ఇట్ల చార్జీలు పెంచినట్టే బస్సులు కూడా పెంచాలి కదా! ప్రయాణికులు ఇంత ఇబ్బంది పడుతున్నా ఎవరు పట్టించుకుంట లేరు. ఒక్కొక్కరు చిన్న చిన్న పిల్లలను వేసుకుని ఇళ్లకు పోతున్నరు. ఉన్నకాన్నే పండుగ చేసుకోక ఎందుకు వచ్చాంరా బాబు అని తలలు పట్టుకుంటున్నరు.

- రాజేశ్, ప్రయాణికుడు (కోరుట్ల)


### రద్దీకి తగినట్టు నడుపుతున్నాం



సంక్రాంతి పండుగకు సహజంగానే రద్దీ ఎక్కువగా ఉంటది. ముఖ్యంగా ఈటైంలో హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది కరీంనగర్ రీజియన్ పరిధిలోని వివిధ జిల్లాలకు వస్తుంటారు. అందుకు తగినట్టుగానే ఈ మార్గంలో 250 బస్సులు అదనంగా నడుపుతున్నాం. గడిచిన రెండు రోజుల్లో 70 వేలకుపైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాం. శనివారం ఒక్క రోజు ఎక్కువ రద్దీ ఉన్నది. రేపటి నుంచి పండుగ పూర్తయ్యే వరకు సాధారణ పరిస్థితులు కనిపిస్తాయి. పండుగ కోసం ప్రత్యేకంగా బస్సులు కూడా వేశాం. పల్లె వెలుగు బస్సులు జిల్లా కేంద్రాల నుంచి ఆయా మార్గాల్లోనే నడుపుతున్నాం.

- బీ రాజు, ఆర్‌ఎం (కరీంనగర్ రీజియన్)





- District
- Mandal
- Village
- Khata Number
- Survey No./Sub-Division No.
- Pattadar Name
- Father / Husband's Name
- Caste Category
- Gender: Female
- Total Extent (Ac. Gts)
- Nature of Land
- Classification of Land
- Market value of Survey no.(in INR)
- Land Status: Digital Signed
- Land Type: Assigned Land
- Transaction Status
- eKYC Status
- PPB Number

## వైఎస్సార్ హయాంలోనే ప్రభుత్వ పట్టా

సిరిసిల్ల టౌన్, జనవరి 11: 'కాంగ్రెస్ నాయకుల కబంధహస్తాల్లో అసైన్డ్ భూములు?' శీర్షికన ఈనెల 8వ తేదీన 'నమస్తే తెలంగాణ' జిల్లా ఎడిషన్‌లో కథనం ప్రచురితమైంది. అందులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, మాజీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ సతీమణి సంగీతం విద్య పేరిట తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ (పి.కె.)లోని సర్వే నంబర్ 368/1/24 ఖాతా నంబర్ 1295లో మూడెకరాల మూడు గుంటల అసైన్డ్ స్థలం ఉన్నట్టు పబ్లిష్ అయింది. దీనిపై లోతుగా ఆరా తీస్తే.. సిరిసిల్ల పట్టణానికి చెందిన సంగీతం శ్రీనివాస్ 1990లో శ్రీవిద్యను ఆదర్శ వివాహం చేసుకున్నారు. ఆ మేరకు 2007లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూపంపిణీ కార్యక్రమంలో తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామపంచాయతీలో గ్రామసభ తీర్మానం మేరకు ఒబులాపూర్ (పి.కె.) పరిధిలో 3.20 ఎకరాల వ్యవసాయ స్థలం ఇచ్చినట్టు తెలిసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్, ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య చేతుల మీదుగా వీరు పట్టా పొందారు. అయితే కథనంలో పొరపాటుగా ప్రచురితమైనందుకు చింతించడంతోపాటు పూర్తి వివరణ ఇస్తున్నాం.

ఆదర్శ వివాహంలో భాగంగానే ఈ అసైన్డ్ భూమి కేటాయించినట్లుగా స్పష్టమవుతున్నది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

## నీళ్లివ్వకుంటే గేట్లు ఎత్తుతాం

- రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- రుణమాఫీ వంద శాతమైందని నిరూపిస్తే రాజీనామా చేస్తా
- ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ టౌన్, జనవరి 11: హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు నీళ్లను ఇవ్వకుండా ఎస్సారెస్పీ కాలువ ద్వారా ఖమ్మం, సూర్యాపేటకు తరలిస్తున్నారని, తమకెందుకు ఇవ్వడంలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తన మీద కోపం ఉంటే తన మీదనే తీర్చుకోవాలని, రైతాంగాన్ని ఇబ్బంది పెట్టవద్దని కోరారు. నీళ్లు ఇవ్వకపోతే రైతులను తీసుకువెళ్లి గేట్లు ఎత్తేస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా హుజూరాబాద్ గడ్డ నీళ్లు తాగిన బిడ్డగా భయపడేదిలేదని స్పష్టం చేశారు. హుజూరాబాద్ నియోజవర్గంలోని 106 గ్రామాల్లో ఏ ఒక్క గ్రామంలోనైనా వంద శాతం రైతు రుణమాఫీ అయిందని నిరూపించినా తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. శనివారం హుజూరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు 169 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం హుజూరాబాద్ తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ఎన్ని కేసులు పెట్టినా వెనుకాడేదిలేదన్నారు. కేసీఆర్ పాలనలో అందించే పథకాలను ఆపడం వల్ల పేద ప్రజలు ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పేరు నచ్చకపోతే, పేరు మార్చుకొని పథకాలను అందించాలని, పేదలకు ఉపయోగపడే మంచి పథకాలను ఆపొద్దని సూచించారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఎకరానికి ₹15 వేలు ఇచ్చేవరకు ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. 20 ఎకరాలు పండించే రైతుకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. వరే కాకుండా పత్తి, మక్క మామిడి రైతులకు కూడా పెట్టుబడి సాయం కచ్చితంగా అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు, 24 గంటల ఫ్రీ కరెంట్, వ్యవసాయానికి నీళ్లు అందేవని, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వ హయాంలో ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. కల్వల ప్రాజెక్ట్ మరమ్మతు గురించి అసెంబ్లీ సాక్షిగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అడిగినట్టు గుర్తు చేశారు. ఆయన సానుకూలంగా స్పందించారని, అభివృద్ధి పనులకోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. దళితబంధు రెండో విడుత ఇవ్వకుంటే ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రాణాలు పోయినా ప్రజలకు అన్యాయం జరుగుతే ఊరుకునేది లేదని, నియోజకవర్గానికి నిధులు ఇవ్వకపోతే ప్రభుత్వాన్ని విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఏ అవసరాలున్నా తన వద్దకు రావాలని సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం ఇస్తానన్న తులం బంగారం ఇచ్చే వరకు, మహిళలు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. సమావేశంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఎడవల్లి కొండాల్‌రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ చైర్‌పర్సన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్ మాజీ జడ్పీటీసీ బక్కారెడ్డి, హుజూరాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మలా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణీసురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బండి రమేశ్, హుజూరాబాద్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కేసులెన్ని పెట్టినా భయపడేది లేదు

- ప్రజల దృష్టి మరల్చేందుకే కేటీఆర్‌పై కేసులు
- జగిత్యాల బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్ రావు, పక్కన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, నాయకులు

జగిత్యాల, జనవరి 11 : అక్రమంగా కేసులు ఎన్ని పెట్టినా భయపడేది లేదని, ధైర్యంగా ఎదుర్కొంటామని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్‌పై కేసుల విషయంలో చూపిస్తున్న స్పీడ్, హామీల అమలు విషయంలో చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. జగిత్యాల బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్ములా ఈ-రేస్ కేస్ విషయంలో కావాలని కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కోవడానికి సిద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తప్పుడు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, గ్యారంటీలు, హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడుతున్నందున కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతూ ప్రజల దృష్టిని మరలుస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అంటున్నారని.. అయితే, కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని చెప్పాలని హితవుపలికారు. కాంగ్రెస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితల గురుంచి అనుచితంగా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ఎంపీ కవిత, మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ సహకారంతో రోళ్లవాగు ప్రాజెక్ట్‌ను పునరుద్ధరించి 0.25 టీఎంసీ నుంచి ఒక టీఎంసీకి పెంచారని చెప్పారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఇప్పుడు కమీషన్‌ల ప్రాజెక్టు అనడం సరి కాదని, కావాలంటే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, జగిత్యాల రూరల్ అధ్యక్షుడు ఆయిల్నేని ఆనందరావు, సారంగాపూర్ మండల అధ్యక్షుడు తేలు రాజు, రాయికల్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్ యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ సాగి సత్యం రావు, చాంద్ పాషా, నరేశ్, వొడ్నాల జగన్, రమేశ్, చందు, సత్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు



- హుందాగా వ్యవహరించడం తెలుసుకో
- బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

## సంజయ్.. నీచ రాజకీయాలు మానుకో!

మానకొండూర్, జనవరి 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నీచ రాజకీయాలు మానుకోవాలని, పదవికి తగ్గట్టు హుందాగా వ్యవహరించడం తెలుసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హితవు పలికారు. ఈ మేరకు శనివారం మానకొండూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బండి కార్పొరేటర్ స్థాయి నుంచి ఎంపీగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి దాకా ఎదిగినా.. ఆయనలో మాత్రం హుందాతనం పెరుగలేదని విమర్శించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సబ్జెక్ట్ తెలువకుండా మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించే స్థాయి సంజయ్‌కి లేదని స్పష్టం చేశారు. కేటీఆర్ పదేళ్లలో రూ. 2.60 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి, హైదరాబాద్‌లో ఎన్నో బహుళ జాతి కంపెనీలు ఏర్పాటు చేయించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారని గుర్తుచేశారు. కానీ, సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి చేసిందేమీ లేదని, కనీసం కమాలాపూర్, తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులు కూడా పూర్తి చేయని అసమర్థ నాయకుడని విమర్శించారు. ఎప్పుడైనా రేవంత్‌రెడ్డి మాట్లాడిన తర్వాత రెండు రోజులకు అదే విషయాన్ని మాట్లాడుతున్నాడని, వీళ్లిద్దరు తోడు దొంగలని, ఏదైనా అనుకునే మాట్లాడుతున్నారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం మీద పోరాటం చేస్తానని సంజయ్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే దేశంలోకి అక్రమంగా చొరబడుతున్న ఉగ్రవాదులపై పోరాటం చేయాలని హితవు పలికారు. హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నా దేశ సరిహద్దులో ప్రాణాలు కోల్పోయిన సైనికుల కుటుంబాలను ఒక్క రోజైనా పరామర్శించిన దాఖలాలు ఉన్నాయా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ నియోజక కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ మాజీ మండల ఇంచార్జి దండ బోయిన శేఖర్, నాయకులు రామంచ గోపాల్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, గడ్డం సంపత్, రాచకట్ల వెంకటస్వామి, నెల్లి శంకర్, కొట్టె రఘు, కోండ్ర వెంకటస్వామి, బొల్లం అనిల్ తదితరులు పాల్గొన్నారు.